# గోడ

ఆంధ్రభూమి మంత్లీ.. మే, 2000




జీవన పోరాటంలో ఆశల, ఆరాటాల మధ్య రోజంతా నలిగి, నిద్ర ఒడిలో ప్రకృతి ఒడిగి సేదతీరుతూన్న సమయం!

అర్ధరాత్రి కావస్తూన్నా శ్రీనివాసరావుకి నిద్ర రావడం లేదు. వరండాలో వాలుకుర్చీలో కూర్చొని, నిశ్శబ్దంగా కదిలిపోతున్న చీకటిరాత్రిలోకి తదేకంగా చూస్తున్నాడు.

ఎంత ప్రయత్నించినా ఈరోజెందుకో ఆయన మనసు ప్రశాంతతని పొందలేకపోతోంది. ఏవేవో ఆలోచనలు నిరంతరాయంగా- కడలి తరంగాల్లా అడ్డూ, ఆపూ లేకుండా మనసును ముంచెత్తుతున్నాయి. వాటిని అణిచివెయ్యాలని కూడా ఆయన అనుకోవటం లేదు.

ఆ స్మృతుల్లో ఆనందం ఉంది- ఆవేదన ఉంది. శాంతి ఉంది- అశాంతి ఉంది. ఆందోళన ఉంది- ఆవేశం ఉంది. అసంఖ్యాకమైన విరుద్ధ భావసంచలనం ఉంది. తనకు వ్యక్తిత్వం తెలిసిందగ్గర్నుంచీ ఈనాటి వరకూ జరిగిన సంఘటనలు ఒక తీరూ, తెన్నూ లేకుండా దాడిచేసి నిలువనీయని అలజడి కలిగిస్తున్నాయి.

"కాళ్లు తడవకుండా కడలిని దాటవచ్చుగాని- కళ్ళు తడవకుండా సంసార సాగరాన్ని దాటలేము' అంటే ఇదేనేమో!"

ఈరోజు తన తండ్రి ఆబ్ధికం!

నలుగురు అన్నదమ్ములు- అక్కచెల్లెళ్ళు వాళ్ళ కుటుంబసభ్యులతో కలసి పితృదేవుణ్ని తలచుకొని, తర్పణ మీయవలసిన రోజు!

ఆయన గతించి ఈనాటికి ఇరవై సంవత్సరాలైంది. ఇంతవరకూ ఒక్కసారి కూడా తామంతా కలసి ఈరోజు జరుపుకోలేదు. ఆయన ఉండగానే గృహకల్లోలాలు ప్రారంభమైనాయి. ఆస్థిపాస్థులు పంచేసుకున్నారు. దివాణంలా కళకళలాడే ఇల్లు- నాలుగు ముక్కలై పోయింది. ఆయన గుండె కూడా అలాగే ఛిద్రమైపోయి, పంపకాలు జరిగిన నెలరోజుల్లోనే కన్నుమూశారు.

గతం తలచుకొని శ్రీనివాసరావు కుర్చీలో స్థిమితంగా ఉండలేకపోయాడు.

ఇనుప పిడికిలితో గుండెను నులిమేస్తున్నట్లు, ప్రాణాలు తోడేస్తున్నట్లు నిలువనీయని నిశ్శబ్ద కలవరం అది!

శబ్దం కాకుండా ఇనుపగేటు తీసుకొని రోడ్డు మీదకు వచ్చాడు.

'మాడిపోతూన్న మానులు, కాలిపోతున్న కట్టెలు మరలా చిగురించడం జరగదు!'

- శ్రీనివాసరావు ఆవేదన కూడా అలాగే ఉంది.

మసక వెన్నెట్లో నాలుగు వాటాల పాతలోగిలి పాడుపడిన దెయ్యాలమేడలా ఉంది. లోపల అంతా ఆదమరచి నిద్రిస్తూ ఉంటారు. వెయ్యిగజాల స్థలంలో అంతదూరం వీధిలో పరుచుకుని ఉంది. ఒరిగిపోయి కూలిపోతున్నట్లున్న ప్రహరీ ఒకప్పుడు పిల్లాపాపలతో కళకళ సందడిగా ఉండే ఉమ్మడి కుటుంబం- ముక్కలు చెక్కలై 'శిథిల హృదయాల' సమ్మేళనంలా మనసులు విరిగి ఎవరికి వార్సై, వంటరులై బ్రతుకుతున్న వ్యక్తి కుటుంబాలు... ఆ చివర చిన్నతమ్ముడు, తరువాత రెండోవాడు, తరువాత మూడోవాడు, ఈ వాటాలో తను, తన కొడుకు.

శ్రీనివాసరావు దీర్ఘంగా నిట్టూర్చి గుండెబరువు తగ్గించుకోవాలనుకున్నాడు. ఈరోజు తల్లిదండ్రుల జ్ఞాపకాలు అతన్ని విడవటం లేదు. ఇంటికి ఎదురుగా రోడ్డుకి అటువైపున ఉన్న బండరాయి మీద కూర్చుని తదేకంగా ఇంటిని చూస్తున్నాడు.

'లేమి' మనసుల్ని ఐక్యం చేస్తే- 'కలిమి' మనుషుల్ని విడదీస్తుందనటానికి తమ అన్నదమ్ముల కథే ఉదాహరణ!

తాతగారికి నాన్నగారు ఒక్కరే సంతానం! ఎంతో ఆస్థిపరులు. తాతగారు పోయేవరకూ ఆయన, అన్నదమ్ములు అందరి కుటుంబాలు కలిసివుండేవి. ఊర్లోనేకాక- చుట్టుప్రక్కల అందరూ 'ఆదర్శ కుటుంబం'గా గొప్పగా చెప్పుకునేవారట! నాన్నగారి హయాంలో కూడా 'ఉమ్మడి కుటుంబం' తామర కొలనులా అలాగే కొనసాగింది.

తాతగారిచ్చిన సంపదను నాన్న పెంచి మరింత చేశారు.

ఊళ్లో అందరికీ తలలో నాలుకగా ఉండి, ఎవరికి కష్టం కలిగినా- 'నేనున్నా'నని ముందుకు దూకే ఉన్నత వ్యక్తిత్వం ఆయనది! తన బంధువుల్ని, కుటుంబీకుల్ని మాత్రమేకాక- ఊళ్లో వాళ్ళనందర్నీ కూడా ఆదరించి లాలించే ఉన్నత సంస్కారం, సాంప్రదాయం ఆ తరంవాళ్ళకి ఉండేది.

తమందరూ పెరిగి పెద్దవాళ్ళయ్యే వరకూ ఆ సత్సాంప్రదాయం అవిచ్ఛిన్నంగా కొనసాగింది. తామందరికీ వివాహాలై, స్వంత కుటుంబాలేర్పడ్డాక 'వ్యక్తిత్వాలు' బలపడి సమస్యలు తలఎత్తాయి.

అప్పటికి నాన్నగారూ పెద్దవారయ్యారు. ఆ సుక్షేత్రంలో ఎప్పుడు, ఎలా విషబీజం పడిందో కాని- అంతా కలుషితమైపోయింది. బీటలు తీసిపోతున్న కుటుంబాన్ని తనున్నంత కాలమైనా ఐక్యంగా నిలపాలని నాన్నగారు శతవిధాల ప్రయత్నించారు. ఆ ప్రయత్నం ఫలించకపోగా- నానాటికీ స్పర్ధలు, విద్వేషాలు పెరిగిపోసాగాయి.

విసిగిపోయిన నాన్నగారు పెద్దమనుషుల సమక్షంలో ఆస్థి మొత్తం అందరికీ పంచేశారు. స్వార్జితం- పిత్రార్జితం... మొత్తం చెంబూ, తప్పాళా సయితం పంచేసుకున్నారు.

చివరికి నాన్నగారి పట్టుధావళం కూడా 'ఆయన జ్ఞాపకార్థం' అన్న అందమైన ముసుగులో నాలుగు ముక్కలైపోయింది.

ఆ సంఘటనతోనే నాన్నగారి హృదయం ముక్కలైంది!

ఆయన్ని ఆదరించి నా దగ్గర ఉంచుకోవాలనుకొన్నా కానీ, 'నాన్నకు సేవ' అనే రంగు పూసి ఆయన వార్ధక్య జీవితాన్ని నాలుగు భాగాలుగా విభజించేశారు. నలుగురూ తలా మూడునెలలు తమ దగ్గర ఉంచుకొని తిండి పెట్టాలని తీర్మానించారు.

పెద్దవాడిని కావటం వలన మొదటి అవకాశం తనకే ఇచ్చారు. నిలువెత్తు అడ్డగోడలు లేచాయి. సంక్రమించిన దానిలో ఎవరికి కావలసిన సదుపాయాలు వారు సమకూర్చుకొన్నారు.

"రత్నాల వంటి నలుగురు కొడుకు లున్నారు... నాకు దిగులేమిటనుకున్నాను. వాళ్ళ రక్షణలో నా వృద్ధాప్యం ప్రశాంతంగా గడిచిపోతుందని కలలు కన్నాను... శీనూ! నా ప్రాణసమంగా పెంచుకున్న పిల్లలురా మీరు! ఈ బంధాలన్నీ దుఃఖ భావనలేనని నా చరిత్ర కూడా ఋజువు చేసిందిరా!"

... ఆరోజాయన నా ఒడిలో తలదాచుకుని గుండెలు పగిలి రోదించటం నేనీ జన్మలో మరచిపోలేను. అదంతా ఒక పీడకల! కానీ, ఆ తరువాత ఒప్పందం ప్రకారం మేమెవరం ఆయన్ని మూడేసి నెలలు 'పంచుకోవలసిన' అవసరం లేకపోయింది. మేం విడిపోయిన కొద్దరోజులలోనే ఆయన మరణించారు.

ఇక- ఆ తరువాత ఎవరి త్రోవ వారిదైంది.

కాలగమనంలో రోజులూ, నెలలూ, సంవత్సరాలూ పరుగెత్తి, పరుగెత్తి కాలగర్భంలో నిర్మలంగా ఒదిగిపోతూంటే... ద్వేష విద్వేషాలు కొంతవరకు తగ్గినా- బీటలు పడిన గుండెలు మాత్రం కలవలేదు. వీగిపోయిన మమతానురాగాలు తిరిగి వికసించలేదు. పెళ్ళి, పేరంటాల వంటి శుభసందర్భాలలో ఊరందరిలాగే మొక్కుబడి ఆహ్వానాలు- ఇబ్బంది వచ్చినపుడు పెదవి చివరి శుష్కసానుభూతి పలకరింపులు... అంతే!

అట్లాగే కాలం గడిచిపోతోంది.

తనూ పెద్దవాడయ్యాడు. ఎప్పుడో పసివయసులో కొద్దికాలం తప్ప- పిల్లల వల్ల తల్లిదండ్రులు పొందగలిగే ఆనందం ఏమీ వుండదు. సరికదా... వృద్ధాప్యంలో కనీసం శాంతి కూడా ఉండదన్న నమ్మకం తనలో కలిగింది. కోరి తెచ్చుకున్న భావం తప్ప మరేమీ కాదని తండ్రి కథ తెలిపింది.

దూరాన ఎక్కడో కోడి కూసింది...

ఆకుల గుబురుల్లో పక్షులు రెక్కలు రెపరెప లాడిస్తున్నాయి...

తూర్పు వాకిలి తెరుచుకుంటోంది...

దివాకర్‌కి అశాంతిగా ఉంటోంది! ఇంతకాలం చిన్నతనపు అమాయకత్వం మూలంగా తను అర్థంచేసుకోలేని చేదుసత్యాలు అర్థమౌతున్నాయి. ఆస్తి మూలంగా విరిగిపోయిన హృదయాలు- ముక్కచెక్కలైపోయిన అనుబంధాలు... ఇప్పుడిప్పుడే అతనికి అర్థమౌతున్నాయి.

'నాన్నగారూ! ఇంత జరిగాక కూడా ఇంక ఈ ఊళ్లో- అదీ 'వీళ్ళ' ప్రక్కనే ఎందుకు ఉంటున్నట్లు..? ముఖముఖాలు చూసుకోరు, పలకరింపులు ఉండవు. నీ నిశ్శబ్దంలో ప్రశాంతత ఉండదు. నివురుమాటున రిగులుతున్న నిప్పులా ఉంటుంది. ఎక్కడికైనా వెళ్లి హాయిగా బతకొచ్చుగా..!'

బాబయ్యగారి పిల్లలు కూడా జూనియర్ కాలేజీలో తన క్లాసులోనే చదువుకుంటున్నారు. ఒకరితో ఒకరు మాట్లాడుకోరు. వైరానికి దశాబ్దాలుగా అలవాటు పడిపోయినందువల్ల క్లుప్తంగా ఎవరి మానాన వాళ్ళు తిరుగుతుంటారు. తన కిక్కడ సంతోషంగా లేదు. హాస్టల్ కెళ్లిపోదామంటే నాన్న బాధపడతారు. తనూ లేకపోతే ఆయన మరీ వంటరిగా ఉండాలి.

శ్రీనివాసరావు కూడా కొడుకు గురించి ఆలోచిస్తున్నాడు...

కొడుకుని వదిలి తను ఉండటం జరగదు. ఎదుగుతున్న పిల్లవాడి ఆలోచనలు, తను అర్థంచేసుకోగలడు. కానీ, ఈ ఊరితో తనకున్న అనుబంధాన్ని- ఈ ఇంటితో, భార్య నుండి తన మనసు పెనవేసుకున్న మమకారాన్ని వాడెలా అర్థంచేసుకోగలడు? స్నేహం- ప్రేమ- ఆత్మీయత పంచి ఇవ్వలేని ఈ పరిసరాల నుండి స్నేహమయ ప్రపంచంలోకి వెళ్లిపోవాలని ఆశపడుతున్నాడు. పోనీ... వాడిని హాస్టల్‌కు పంపితే..?! తను!?

శ్రీనివాసరావుకి ఏం చెయ్యాలో అర్థంకావటం లేదు. తామున్నా, లేకపోయినా- కష్టసుఖాలలో పాలుపంచుకోవటానికి వాడికి తోడుగా మరొక బిడ్డ తమకు ఉండాలని అప్పట్లో భార్య చెప్పినా తను ఇష్టపడలేదు. అన్నదమ్ముల మధ్య ఐక్యత అబద్ధమని పసితనంలోనే వాళ్ళ మధ్య నిర్మలమైన ప్రేమాభిమానాలుంటాయని, పెద్దయితే ఎవరికి వారే స్వార్థపరులైపోతారని- తను పడిన బాధ తన కొడుకు అనుభవించకూడదనీ అనుకున్నాడు. ఇప్పుడు వాడికా తల్లిప్రేమ కూడా కరువైంది.

"నాన్నగారూ..." దివాకర్ తండ్రి మంచం దగ్గర కూర్చుని దీనంగా పిలిచాడు.

ఈమధ్య శ్రీనివాసరావు అనారోగ్యంతో మంచం పట్టాడు. మనసులో దిగులు- శరీరంలోని అనారోగ్యాన్ని మరింత పెంచుతోంది. పక్కింట్లో శ్రీనివాసరరావు రోగంతో మంచం పట్టినా అన్నదమ్ములెవరూ పట్టించుకోలేదు. అసలు వాళ్ళకీ విషయమే తెలిసినట్టు లేదు. ఎవరూ ఈ వాటాలోకి తొంగి కూడా చూడలేదు.

దివాకర్ మనసు విలవిలలాడిపోతోంది. నాన్నగారు నెలరోజులుగా మంచం మీదే ఉన్నారు. ఊరివాళ్ళంతా వచ్చి పలకరించి పోతున్నారు. 'వాళ్ళ'కి మాత్రం చీమకుట్టినట్టు లేదు. ఏం మనుష్యులు... అన్నదమ్ములట వీళ్ళు?

రాత్రిళ్ళు పాలిగాడు తనకు తోడుగా ఉంటున్నాడు. రంగమ్మగారు వంటపని, ఇంటిపని చేస్తోంది. అమ్మ పోయిన దగ్గర్నుంచీ ఆవిడే కాస్త తమని కనిపెట్టుకుని ఉంటోంది.

శ్రీనివాసరావు కళ్ళు తెరిచి చూశాడు...

దివాకర్ బిక్కమొహంతో, దిగులు చూపులతో, ఎదురుగా వంటరిగా, నిస్సహాయంగా నిలబడివున్నాడు.

ఆయన మనసు దిగులుతో కదిలిపోతోంది.

"నాన్నా... దివా... నువ్వు ఇక హాస్టల్‌కి వెళ్ళిపోవచ్చురా! వంటరివాడ్నని దిగులుపడకు... మంచి స్నేహితుల్ని సంపాదించుకో... రక్తబంధువుల అనుబంధం... చూస్తున్నావుగా..."

దివాకర్ భోరుమన్నాడు- "వద్దు నాన్నా... నేనెక్కడికీ వెళ్లను... నీతోనే ఉంటాను."

"ఊరుకోండి బాబూగారూ... ఏమిటా మాటలు? పిల్లాడు బెంబేలు పడిపోతున్నాడు..." అంది రంగమ్మ- దివాకర్‌ని సముదాయిస్తూ.

"దివాకర్! పెదనాన్నగారూ..." అంటూ వచ్చారు నలుగురు పిల్లలు.

వాళ్ళని చూస్తూనే తండ్రీకొడుకులు నివ్వెరపోయారు.

నమ్మలేక "ఎవరది..?" అన్నాడు శ్రీనివాసరావు లేచి కూర్చోవాలని ప్రయత్నిస్తూ.

వాళ్ళు ఆయనకు దగ్గరగా వచ్చి- "మేమే పెదనాన్నగారూ... ఇప్పుడు మీకెల్లా ఉంది?! డాక్టర్‌గారేమన్నారు? దివాకర్- అరె... ఎందుకల్లా దిగులుగా ఉన్నావు? పెదనాన్నగారికి తగ్గిపోతుంది?"

- అంటూ చుట్టూ చేరి సందడి చేస్తున్న పిల్లల్ని చూస్తుంటే శ్రీనివాసరావుకి ఆనందంతో నోట మాట రాలేదు. వాళ్ళందరూ తన తమ్ముళ్ళ పిల్లలే! దివాకర్‌కి వాళ్ళని చూస్తే ధైర్యం వచ్చినట్లుంది. వాళ్ళతో కలిసిపోయి ఏవేవో కబుర్లు చెప్తున్నాడు.

"మీరేం దిగులు పడకండి పెదనాన్నగారూ... జరిగింది మర్చిపోదాం! దివాకర్‌కి మేమంతా ఉన్నాం. మేమూ అన్నదమ్ములమే కానీ... మీలా ఉండం! ఆరోజులు వేరు..! ఈతరం వేరు... ఆ తరం వేరు! కదూ దివాకర్?!" అందరిలోకి పెద్దవాడైన సుధాకర్ అన్నాడు.

'అవును... ఈతరం వేరు నాయనా... ఇది యువతరం..!' అనుకున్నాడు.

నలుగురి మధ్య సందడిగా, సరదాగా ఉన్న కొడుకుని చూస్తుంటే... తనకేదో గొప్ప బలం వచ్చినట్లనిపించింది శ్రీనివాసరావుకి.

అతడి మదిలో అడ్డుగోడలేవో కూలిపోతున్న భావన!